క్లుప్తంగా

చింతమడుగులో చేపల వేట నిషేధం

దస్తురాబాద్: మండలంలోని భూత్కూర్ పంచాయతీ పరిధిలోని రాంపూర్ గ్రామ గోదావరి తీరం చింతమడుగు ప్రాంతంలో చేపల వేట ను నిషేధించినట్లు తహసీల్దార్ విశ్వంభర్ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆదేశాలనుసారం నిషేధ ఆజ్ఞలు అమలులో ఉంటాయని..దస్తురాబాద్, రాంపూర్ మత్స్యకారులు చేపల వేట సాగించవద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

దివ్యాంగులకు చేయూత

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గూడు లేక రోడ్డు పక్కన నివాసం ఉంటున్న నిరుపేద దివ్యాంగులకు ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఒడ్డెపల్లి కష్టం రాజు చేయూతనిచ్చారు. శనివారం వారిని కలిసి మూడు నెలలకు సరిపడా రూ.ఐదు వేల నిత్యావసర సరుకులను అందజేశారు. దీనిపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

వర్షం కోసం పూజలు



పూజలు నిర్వహిస్తున్న రైతులు

కుంటాల: వర్షం కురవాలని కోరుతూ మండలంలోని ఓలా గ్రామ హనుమాన్ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి జలాలను తీసుకొచ్చి గ్రామ దేవతలకు అభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని మొక్కుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

బాధ్యతల స్వీకరణ

నర్సాపూర్(జి): నర్సాపూర్ (జి) మండల ఎస్సైగా కె.గణేశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ డీసీఆర్‌బీలో పని చేసి బదిలీపై నర్సాపూర్ (జి) వచ్చారు. ఇక్కడి ఎస్సైగా పనిచేసిన పి.సాయికిరణ్ కడెం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని.. ప్రజలు సహకరించాలని నూతన ఎస్సై కోరారు.

హెచ్‌ఎంకు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

కుభీర్:మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన సట్ల గంగాధర్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కల్యాణ్, కుభీర్ మాజీ సర్పంచ్ విజయ్, సంతోష్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



ముగ్గు వద్ద నాయకులు

ముధోల్: మండలంలోని ఆష్టా గ్రామంలో పలువురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవగా శనివారం కాంగ్రెస్ నాయకులు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రావుల శ్రీనివాస్, దేవేందర్, మీనాజ్, పల్లె గంగాధర్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

టవర్ వద్దని ఆందోళన



మాట్లాడుతున్న కాలనీ వాసులు

కడెం: మండలంలోని కొండుకూర్‌లోని ఫంక్షన్‌హాల్ పక్కన సెల్‌టవర్ ఏర్పాటు చేయవద్దని కాలనీవాసులు శనివారం ఆందోళన చేపట్టారు. ఇళ్లకు దూరంగా టవర్‌ను మరో చోట ఏర్పాటు చేసుకోవాలని కడెంలో ఎంపీడీవో అరుణకు వినతిపత్రం అందజేశారు. టవర్ పనులను నిలిపివేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో గ్రామస్తులు గొల్ల రాజమౌళి, కల్లెం నారాయణరెడ్డి, వెంకవ్వ, శివప్రసాద్, సత్తెవ్వ, మొండేశ్, నాగలక్ష్మి, సుమరాణి, లావణ్య తదితరులున్నారు.

ఆలయాలకు దాతల విరాళం

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ హనుమాన్ మందిరం, రాజురా గ్రామ మార్కండేయస్వామి ఆలయాల అభివృద్ధికి శనివారం పలువురు దాతలు రూ.25వేలను విరాళంగా సమకూర్చారు. పట్టణానికి చెందిన పన్నెల జనార్దన్, వింజామర విజయ్, శ్రీకాంత్, వాల్గొట్ మణిచందన్ ఆలయాల నిర్మాణానికి తమ వంతు సాయాన్ని ఆలయాల కమిటీ సభ్యులకు నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నం రవీందర్, గడ్డం రవీందర్, శెట్టి సంజీవ్, తదితరులు ఉన్నారు.

ఏళ్లు గడుస్తున్నా.. ఏం మారలే

- గుంతలమయంగా బీరవెల్లి– లోలం రోడ్డు
- రెండు మండలాల ప్రజలకు ఇబ్బందులు
- మొరం పోసినా మారని పరిస్థితులు



గుంతలమయంగా రోడ్డు



కంకర తేలి ప్రమాదకరంగా రోడ్డు

సారంగాపూర్: మండలంలోని బీరవెల్లి నుంచి దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామం వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారి కంకర తేలింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తరచుగా అదుపుతప్పి కిందపడి గాయాల పాలవుతున్నారు. గతంలో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మొరం నింపినా.. అది కొద్దిరోజులకే కొట్టుకుపోయింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఈ రోడ్డు సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

తొమ్మిదేళ్ల కిందట..

2016 ఆగస్టులో దిలావర్‌పూర్ మండలంలోని లోలం, సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి గ్రామం మీదుగా భైంసా ప్రధాన రహదారిని కలుపుతూ నాలుగు కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ నిధులు రూ.2.5కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ రహదారిపై నిత్యం దిలావర్‌పూర్, సారంగాపూర్ మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి ఆదివారం మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్దకు వచ్చే భక్తులు ఎక్కువ మంది ఈ మార్గాన్నే ఎంచుకుంటారు. అలాంటి రహదారిపై ప్రస్తుతం గుంతలు ఏర్పడి కంకరతేలి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో ఆయిల్‌పాం నర్సరీ ఉండడంతో మొక్కలు తీసుకెళ్లేందుకు వచ్చే వారు, పొలాలకు ఎరువులు తరలించేందుకు పలువురు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

రూ.లక్షన్నర నిధులు నేలపాలు..

2023లో పంచాయతీరాజ్ అధికారులు రూ.1.5లక్షల నిధులు కేటాయించి రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మొరం నింపి గుంతలు పూడ్చివేయించారు. గుంతలు పూడ్చిన మూడు, నాలుగు నెలల్లోనే మొరం మొత్తం కొట్టుకుపోయింది. దీంతో రోడ్డుపై మళ్లీ గుంతలు ఏర్పడి పాత కథే పునరావృతమైంది. ఈ గుంతల కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. నెల రోజుల కిందట గుంతలు గమనించకుండా దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామానికి చెందిన లక్ష్మణ్, గతంలో బన్సపెల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు బైక్‌పై ప్రయాణిస్తూ గుంతలో పడి గాయాల పాలయ్యారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు

గుంతలు పడి అధ్వానంగా మారిన బీరవెల్లి–లోలం రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఇప్పటికే రెండుసార్లు టెండర్లు ఆహ్వానించాం. టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టడం లేదు. కాంట్రాక్టర్లు ముందుకు వస్తే పనులు చేయించి రోడ్డు సమస్య పరిష్కరిస్తాం.

– తుకారాం, డీఈఈ, పంచాయతీరాజ్

కొలాంగూడకు బస్సు వచ్చిందోచ్

ఖానాపూర్: మండలంలోని బీర్నంది జెడ్పీహెచ్‌ఎస్‌లో చదివే కొలాంగూడ విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించి ఎర్వచింతల్, రంగపేట్ గ్రామాల విద్యార్థులకు వచ్చే బస్సు సమయ పాలన పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఈనెల 27న సాక్షిలో సారూ..మా ఊరికి బస్సు నడిపించరూ.. శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆర్టీసీ అధికారులు ఎర్వచింతల్ నుంచి కొలాంగూడ వరకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించడంతోపాటు సాయంత్రం సకాలంలో విద్యార్థులకు బస్సు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని నిర్మల్ ఆర్టీసీ డీఎం పండరి తెలిపారు. ప్రజలు సైతం ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీని ఆదరించాలని కోరారు.



కొలాంగూడలో బస్సు వద్ద విద్యార్థులు

సాక్షి ఎఫెక్ట్..

కళాశాలలో తీరిన నీటి కష్టాలు



తానూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేకపోవడంతో ఒంటికీ, రెంటికీ వెళ్లేందుకు విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈనెల 26న సాక్షిలో ఒంటికీ ..రెండికీ కష్టాలే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం పంచాయతీ, ఆర్‌డబ్ల్యూస్ అధికారులు కళాశాలకు వెళ్లి అధ్యాపకులతో మా ట్లాడి సమస్య తెలుసుకున్నారు. సమీపంలోని బోరు మోటారు నుంచి కళాశాలకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరాను ప్రారంభించారు.

పైపులైన్‌కు మరమ్మతులు



లక్ష్మణచాంద: మండలకేంద్రం సమీపంలోని కేజీబీవీ వద్ద మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ వాల్వ్ వద్ద లీకేజీ ఏర్పడి నీరంతా వృథాగా పోయింది. దీనిపై ఈనెల 28న సాక్షిలో వృథాగా భగీరథ జలం శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు శనివారం వాల్వ్ వద్ద మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టారు.

దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తాం

- ఇందిరమ్మ ఇళ్లలో కేంద్రం వాటా
- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

కుభీర్: మండలంలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంలో 85 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుభీర్ వివేకానంద చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని.. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. మహారాష్ట్ర సరిహద్దు సిర్పెల్లి గ్రామం నుంచి మాలేగాం వరకు రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి డబ్బులతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి విస్మరించిందని.. దీనిపై తాము ఉద్యమిస్తామన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.5లక్షల్లో కేంద్రం వాటా రూ.2లక్షలు ఉందని వివరించారు. అనంతరం కుప్టి, హల్దా, డొడర్న తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. పార్డి(కె) గ్రామానికి చెందిన ముగ్గురికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సాగర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కల్యాణ్, ఆత్మ చైర్మన్ వివేక్, బోయిడి విఠల్, వడ్నం నాగేశ్, మోహన్, వివిధ గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు.



చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్: నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణం, నిర్మల్‌రూరల్, సారంగాపూర్, నర్సాపూర్, దిలావర్‌పూర్, సోన్, మామడ, లక్ష్మణచాంద మండలాలకు చెందిన 55 మంది లబ్ధిదారులకు రూ.15లక్షల విలువైన చెక్కులు మంజూరయ్యాయి. శనివారం బాధిత కుటుంబాలకు బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో చెక్కులు అందజేశారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక..

సోన్: నిర్మల్‌రూరల్ మండలం మంజులాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్, సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన బర్మా గంగాదాస్ ఆయన అనుచరులు శనివారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. నిర్మల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి నిర్మల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు భాజపా నాయకులు వి.సత్యనారాయణ గౌడ్, రావుల రామ్నాథ్, ముత్యం రెడ్డి, జమాల్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

మత్తు పదార్థాలకు దూరం ఉండాలి

సోన్: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలపై పారామెడికల్ వలంటీర్స్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుజ్జ జనార్దన్, కూన రాములు, కూన పోశెట్టి, జాప రాములు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

ముధోల్: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నయాబాది కాలనీలో ర్యాలీ నిర్వహించి మత్తు పదార్థాల అనార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేరాజ్ మహబూబ్, అధ్యాపకులు నారాయణ, శ్రీనివాస్, సురేశ్, గణేశ్, స్వరూప, శ్యాంసొద్దీన్, గోపాల్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరం ఉండి చదువుపై దృష్టి సారించాలని పలువురు పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, నిర్మల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు నాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు రిటైర్డ్ ఉద్యోగులు కిషన్‌రావు, బాలకృష్ణ, గంగన్న, ఉపాధ్యాయులు హరిప్రసాద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సోన్‌లో అవగాహన కల్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు



ముధోల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మామడ: యువత మత్తు పదార్థాలకు దూరం ఉండాలని విశ్రాంత వైద్యాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పారా లీగల్ వాలంటీర్స్ జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎన్‌జీఓ సభ్యులు మహేందర్‌రెడ్డి, పోతన్న, హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి

నిర్మల్‌టౌన్: పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్లో ఇటీవల ఎన్నికైన నిర్మల్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు మాట్లాడారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాసం శ్రీ.ధర్, ప్రధాన కార్యదర్శి బాస లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ, పెన్షనర్ సంఘ జాతీయనేత ఎంసీ లింగన్న, సభ్యులు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్, వైద్యులు చక్రధారి, రమేశ్‌రెడ్డి, వేణుగోపాల్, ఉపాధ్యాయ సంఘం నేతలు సన్మానించారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

భైంసాలో సమస్యలు పరిష్కరించండి

భైంసాటౌన్: పట్టణంలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త విలాస్ గాదేవార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆటోనగర్ బైపాస్ మార్గంలోని వివేకానంద చౌరస్తా, ఆంధ్రాబ్యాంక్ వద్ద, తదితర కాలనీల్లో కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లపై ఏర్పడిన గుంతలతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టి నాలాల్లో పూడిక తొలగించాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ రాజేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి

భైంసాటౌన్: కాలనీ ఏర్పడి 20 ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ సరైన సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేవని వెంటనే నిర్మించాలని పట్టణంలోని భాగ్యనగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బి.రాజేశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆస్తిపన్ను రూపంలో మున్సిపాలిటీకి ఆదాయం చేకూరుస్తున్నామని అన్నారు. అభివృద్ధి పనులు చేపట్టి మా ఇబ్బందులు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాజు, కృష్ణ, సాయికిరణ్ తదితరులున్నారు.

స్త్రీనిధి బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న అధికారులు, నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని 11వ వార్డులో స్వయం సహాయక సంఘం సభ్యురాలైన బొంగోని లక్ష్మి కొన్ని నెలల కిందట కోతుల దాడిలో మృతిచెందగా బాధిత కుటుంబానికి శనివారం మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, మెప్మా అధికారులు, సిబ్బంది రూ.10లక్షల స్త్రీ నిధి ప్రమాద బీమా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడారు. గతంలో స్వయం సహాయక సంఘం సభ్యురాలు మృతిచెందితే రూ.లక్ష పరిహారం మాత్రమే వచ్చేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం సదరు పరిహారాన్ని రూ.10లక్షలకు పెంచిందన్నారు. ఖానాపూర్‌లో సభ్యురాలికే మొదట చెక్కు పరిహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సుభాశ్, మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాజిద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్ తదితరులు ఉన్నారు.

విఠాపూర్‌కు మహంకాళి అమ్మవారు

కుంటాల: మహారాష్ట్రలోని చందా మహంకాళి అమ్మవారు శనివారం కుంటాల మండలంలోని విఠాపూర్ గ్రామానికి చేరుకొంది. ప్రతిఏటా వర్షాకాలం ఇక్కడకు వచ్చే అమ్మవారి ప్రతిమకు గ్రామస్తులు పూజలు నిర్వహిస్తారు. అనంతరం వేరే గ్రామ శివారులో అమ్మవారిని ఉంచి వెళ్తారు. తర్వాత ఆ గ్రామస్తులు తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

వైభవంగా కుంకుమార్చన



ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న మహిళలు

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామ ముత్యాలమ్మ ఆలయంలో శనివారం కుంకుమార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. ముత్యాలమ్మ విగ్రహం ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ మహిళలు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షిప్త వార్తలు

రేపు చెక్కులు పంపిణీ

లోకేశ్వరం: మండలకేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఉదయం 11 గంటలకు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తారని తహసీల్దార్ సర్ఫరాజ్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

ముధోల్: మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే రామారావు పటేల్ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పదాధికారులు రావాలని కోరారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఖానాపూర్: నిబంధనలు ఉల్లంఘిస్తూ విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలను విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించారు. వారు మాట్లాడారు. పాఠశాలల యాజమాన్యాలు అధిక ధరలకు పుస్తకాలు, నోట్‌బుక్‌లు, స్టేషనరీ సామగ్రిని విక్రయిస్తూ బహిరంగ దోపిడికి పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. డోనేషన్ల పేరిట ఫీజులను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మహిపాల్, అజయ్, నరేశ్, సాయి, కిష్టు, రఘు, రాము, రాజు, తదితరులు ఉన్నారు.

నోట్‌బుక్‌ల పంపిణీ

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో శనివారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నోట్‌బుక్‌లు అందజేశారు. గతంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాత్రమే నోట్‌బుక్‌లు పంపిణీ చేసేవారు. కానీ ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలలకు సైతం నోట్‌బుక్‌లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఆర్పీలు సుధాకర్, మహేందర్ ఉన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఎంఈవో చంద్రకాంత్ మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నోట్‌బుక్‌లు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు అశోక్‌రెడ్డి, దేవిదాస్, లక్ష్మణ్‌రావు, సురేశ్‌రావు, రవీందర్, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

'కడెం'కు స్వల్ప ఇన్‌ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు 937క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు శనివారం ప్రాజెక్ట్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 679.225 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు పేర్కొన్నారు.

చెక్కు అందజేత

కడెం: మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామంలో బింగి అంజన్నకు రూ.56.వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. శనివారం యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ముడికె మల్లేశ్ యాదవ్ బాధిత కుటుంబీకులకు చెక్కు అందించారు. పెద్దమల్లేశ్, సత్తెన్న, రాజేశ్, గంగాసాగర్ ఉన్నారు.